క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో న్యాయచైతన్య సదస్సు



వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

మణుగూరురూరల్: మండలంలోని ఉడతానేని గుంపు ప్రాంతంలో ఉన్న నేనుసైతం ఆర్గనైజేషన్స్ వారి అమ్మనాన్న వృద్ధాశ్రమంలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి వృద్ధులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మణుగూరు బార్ అసిసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, పోశం భాస్కర్, సర్వేశ్వరరావు, పద్మావతి, కోర్ట్ సిబ్బంది, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

ములకలపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. త్వరలో జరుగనున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా స్థానిక కమిటీలు చురుగ్గా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు. పువ్వాల మంపగతి, కరుటూరి కృష్ణ, గాడి తిరుపతిరెడ్డి, కారం సుధీర్, నల్లమోతు జగదీష్, ఎలకం వెంకటేశ్, శనగపాటి రవి, కోరంపల్లి చెన్నారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

ములకలపల్లి: ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పేటేటి నర్సింహారావును ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. సోమవారం ఎమ్మెల్యే ఆదినారాయణ మండలపరిధిలోని నర్సింహాపురం గ్రామంలోని పేటేటి స్వగృహానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కోలుకునే వరకూ విశ్రాంతి తీసుకోవాలని, అన్నివిధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తొలుత సత్యంపేటలో నివసిస్తున్న మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సడియం బక్కులను ఎమ్మెల్యే కలిశారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కోరంపల్లి చెన్నారావు, శనగపాటి రవి, బాలాజీ, కొప్పుల రాంబాబు, సురభి రాజేశ్, పాలకుర్తి సుమిత్ తదితరులు ఉన్నారు.

పుస్తకాల పరిశీలన

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీలోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల పుస్తకాల వెరిఫికేషన్‌లో భాగంగా మానిటరింగ్ బృందం సభ్యురాలు నాగశ్రీ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల పుస్తకాలను పరిశీలించి ఉపాధ్యాయుల ప్రతిభను కొనియాడారు. 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా శ్రమించాలని సూచించారు. అనంతరం హెచ్‌ఎం స్వరూపా రాణి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలని, చదువు పట్ల ఏకాగ్రత చూపాలని విదార్థులకు సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమేశ్, ఉపాధ్యాయులు కల్యాణి, వేణు, లలిత, రాజసింహ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

దుమ్ముగూడెం: క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని, పాజిటివ్‌గా తీసుకోవాలని ఎస్‌ఐ పోటు గణేష్ సూచించారు. మంగళవారం గౌరారం గ్రామంలో గౌరారం యూత్, గ్రామ పెద్దల సహకారంతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి బ్యాటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో క్రీడాకారులకు కొదవ లేదని, అందరూ తమ లక్ష్యాలను నిర్ణయించుకుని ముందుకు సాగాలని అన్నారు. గ్రామాల్లోని క్రీడా కారుల ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రీడా పోటీలు ఎంతో ఉపయోగకరం అన్నారు. టోర్నీ నిర్వాహకులు రేసు శ్రీను, వాగే కృష్ణబాబు, సొందె సురేష్, సీనియర్ క్రీడాకారులు తెల్లం హరికృష్ణ,సుమన్, రఘు, రమేష్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి భరోసా

ఆరోగ్య మహిళ, ఆంటెనాటల్ కేర్ క్లినిక్‌లలో పరీక్షలు

- చెకప్‌లకు ముందుకొస్తున్న నారీమణులు
- ఉచిత టెస్టులు, మందులపై హర్షం



మహిళలను పరీక్షిస్తున్న వైద్యాధికారి మధు



వైద్య పరీక్షలు చేయించుకున్న గర్భిణులతో వైద్య సిబ్బంది

కరకగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించే దిశగా చేపట్టిన 'ఆరోగ్య మహిళ', 'ఆంటెనాటల్ కేర్ క్లినిక్' కార్యక్రమాలకు అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రతి మంగళవారం, గురువారం ప్రత్యేకంగా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. పెద్ద జబ్బులు దరిచేరకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వైద్యులు వారిని పరీక్షిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి మందులు అందజేస్తున్నారు. అవసరాన్నిబట్టి పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. తద్వారా మహిళల ఆరోగ్యానికి భరోసా కలుగుతోంది.

8 రకాల పరీక్షలు

ఆరోగ్య మహిళ క్లినిక్‌లతో మహిళల ఆరోగ్యానికి భరోసా కలుగుతోంది. ప్రతీ గురువారం ఈ క్లినిక్‌లలో మహిళలకు 8 రకాల వ్యాధులకు సంబంధించిన ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇందులో రక్తహీనత, థైరాయిడ్, రక్తపోటు, డయాబెటిస్, స్తన కేన్సర్, గర్భాశయ కేన్సర్ ఇతర సాధారణ వ్యాధుల పరీక్షలు ఉంటాయి. పరీక్షల ఫలితాల ఆధారంగా ప్రాథమిక చికిత్సను అందిస్తారు. అంతేకాకుండా మహిళల ఆరోగ్యం గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి అవసరమైతే మరింత చికిత్స కోసం పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తారు.

వ్యాధుల ముందస్తు గుర్తింపు

ప్రాణాంతక వ్యాధులు ముందస్తు గుర్తింపు..
ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే. ఇందులో భాగంగా వారిలో అనేక రకాల వ్యాధులను ముందుగా గుర్తించి, దానికి తగిన చికిత్సకు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ముందుగా గుర్తించడం వల్ల మరణాల రేటును తగ్గించవచ్చు. వ్యాధి వచ్చిన తరువాత మహిళపై పడే ఆర్థిక భారాన్ని ముందుగానే తొలగించినట్లు అవుతుంది. మరోవైపు, ఆరోగ్య మహిళా కార్యక్రమంలో వారికి సామాజిక అవగాహన పెంపొందిస్తున్నారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే అన్ని వర్గాల మహిళలకు సమాన వైద్య సేవలు అందించడంతో సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించినట్లు అవుతోంది.

గర్భిణులకు ఆంటెనాటల్ కేర్..

ఆంటెనాటల్ కేర్ క్లినిక్ కార్యక్రమంలో గర్భధారణ కాలంలో గర్భిణుల ఆరోగ్యం, గర్భం ఆరోగ్యకరమైన అభివృద్ధి, సురక్షిత ప్రసవం లక్ష్యంగా పెట్టుకుంటారు. ప్రతీ మంగళవారం వారికి వివిధ రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కాన్, బ్లడ్ ప్రెషర్ చెక్ చేయడం వంటివి చేస్తారు. గర్భధారణ సమయంలో వచ్చే సాధారణ సమస్యలు, వ్యాధుల గుర్తింపు, తల్లి, బిడ్డ ఆరోగ్యం కోసం సరైన ఆహారం గురించి సలహాలు ఇవ్వడం, టెటానస్, హెపటైటిస్బి వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి వ్యాక్సిన్లు ఇవ్వడం వంటి చర్యలు చేపడుతారు. సురక్షిత ప్రసవం గురించి సమగ్రమైన సమాచారం అందిస్తున్నారు. గర్భధారణ సమయంలో వచ్చే మానసిక మార్పుల గురించి సలహాలు ఇస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఒక పుస్తకంలో వైద్యులు నమోదు చేసి గర్భిణులకు అందజేస్తున్నారు.

రక్త పరీక్షలు చేసుకున్న..



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిని సంప్రదించి నా ఆరోగ్య సమస్యను చెప్పాను. పరీక్షించి కొన్ని రకాల రక్త పరీక్షలు చేసి మందులను ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు ఆరోగ్యం బాగుంది. ప్రతీ రోజు పనికెళ్తున్న. అంతకముందు ఆరోగ్య సమస్యలతో బాధపడేదాన్ని. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేసుకునే స్థోమత మాకు లేదు. పేదలకు ఇటువంటి కార్యక్రమంతో ఎంతో మేలు.

– చర్ప లక్ష్మి, పద్మాపురం

దూరం వెళ్లే బాధ తప్పింది..



ప్రతీ మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేసుకున్న. వైద్యులు, సిబ్బంది చాలా బాగా చూసుకుని ఆరోగ్య సలహాలు ఇచ్చారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీకాల గురించి వివరించేవారు. తద్వారా నేను చెకప్ కోసం దూర ప్రాంతాలలోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే బాధ తప్పింది. ముఖ్యంగా గర్భిణులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– పాయం పూర్ణసత్యవతి, రేగళ్ల

ఆరోగ్య సంరక్షణే లక్ష్యం..



మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. దీంతో వారి జీవితాలలో గణనీయమైన మార్పును గమనిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నాం. వ్యాధుల నివారణ, పోషకాహారం, స్వచ్ఛత గురించి అవగాహన కల్పిస్తున్నాం. ప్రసూతి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

– కారం మధు, వైద్యాధికారి, కరకగూడెం

ముమ్మరంగా వాహన తనిఖీలు



పినపాక: బయ్యారం క్రాస్ రోడ్‌లో తనిఖీలు చేపడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

పినపాక: తెలంగాణ పోలీసులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్టేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే మండల పరిధిలోని బయ్యారం క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద సీఐ వెంకటేశ్వర్లు ఇసుక వాహనాలను ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రసీదులు, కాంటా స్లిప్పులు పరిశీలించారు. ధ్రువపత్రాలు లేని వాహనాలను జప్తు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనం ముందు, వెనక రాత్రి వేళలో కనపడే విధంగా రేడియం స్టిక్కర్ ఏర్పాటు చేయాలని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు గ్రామాల్లో..

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ మావోయిస్టు పార్టీ ఇచ్చిన బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల బంద్ నేపథ్యంలో చర్ల మండల శివారు గ్రామాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండలం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోకి వెళ్లే ప్రధాన రహదారుల్లో ప్రత్యేక నిఘాను ఉంచడంతో పాటు పూసుగుప్ప, తిప్పాపురం, కుర్నపల్లి తదితర మార్గాలలో పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. అనుమానితులుగా భావిస్తూ పలువురిని అదుపులోకి తీసుకుని, నిర్ధారించుకున్న తరువాత విడిచిపెట్టారు. సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ తనిఖీలు నిర్వహించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నరేశ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ములకలపల్లి టౌన్, పాత పొగళ్లపల్లి పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి నల్లాకు స్థానికుల మరమ్మతు

అశ్వాపురం: మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట గోదావరి తాగునీటి పంపు మరమ్మతులకు గురికావడంతో నాలుగు రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో మంగళవారం స్థానికులే మరమ్మతులు చేసుకున్నారు.

బియ్యం వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరివర్తన యశోదా ఫౌండేషన్ సేవా సమితి అధ్యక్షుడు కొమ్మగిరి వెంకటేశ్వర్లుకు 25 కిలోల బియ్యాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. యశోదా ఫౌండేషన్ వారు చేస్తున్న ప్రయత్నానికి తమవంతు చిరు సహాయం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేఎస్‌ఎల్‌వీ ప్రసాద్, కృష్ణమూర్తి, నారాయణ, నాళం సత్యనారాయణ, సీహెచ్ సుబ్బయ్య చౌదరి, రాజబాబు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

అశ్వారావుపేటరూరల్: అనుమతులకు మించి అక్రమంగా నిర్మాణాలు చేసిన ఓ రెసిడెన్సీపై ఆదే బిల్డింగులో ఉంటున్న వారు మంగళవారం మున్సిపాలిటీ కమిషనర్ సుజాతకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.

పట్టణ పరిధిలోని గుర్రాల చెరువు మార్గంలో ఆరేళ్ల క్రితం ఓ బిల్డర్ మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మూడు అంతస్తుల్లో నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నాడు. ఆ తర్వాత అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగో ఫ్లోర్‌లో మరో నాలుగు ప్లాట్లు నిర్మించి పలువురికి విక్రయించినట్లు అదే రెసిడెన్సీకు చెందిన మూడో ఫ్లోర్‌లో నివాసం ఉండే పాలగుడుల రమేష్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయడంతోపాటు ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వీటిపై తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. ఫిర్యాదు అందుకున్న మున్సిపాలిటీ కమిషనర్ విచారణ చేసి చేస్తామని అన్నారు.

ఒంటరి మహిళకు చేయూత



ఒంటరి మహిళకు జేడీ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కిరాణా షాపు

బూర్గంపాడు: బూర్గంపాడుకు చెందిన బర్ల సుజాత అనే నిరుపేద ఒంటరి మహిళకు జేడీ ఫౌండేషన్ ఆర్థిక చేయూతనందించింది. ఆమె జీవనోపాధుల కోసం జేడీ ఫౌండేషన్ కిరాణా దుకాణం ఏర్పాటు చేయించింది. ఈ సందర్భంగా జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు హన్సి, నాగరాజులు మాట్లాడుతూ.. ఉపాధి భరోసా కార్యక్రమంలో భాగంగా సుజాతకు కిరాణా దుకాణం ఏర్పాటు చేసి స్వశక్తితో జీవనోపాధి పొందేందుకు చేయూతను అందించామని అన్నారు.

నిబంధనలు పాటించాలి



కూలీల హాజరును తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

అశ్వారావుపేటరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో నిబంధనలు పాటించాలని స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం రామన్నగూడెం, అనంతారం, మల్లాయిగూడెం, గాండ్లగూడెం, బచ్చువారిగూడెం, వినాయకపురం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పనుల వద్ద కూలీల హాజరు, పనుల కొలతను తనిఖీ చేసి సూచనలు చేశారు. ఈజీఎస్ ఏపీఓ కె.రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



సెయింట్ మేరీస్ పాఠశాల వేదికపై విద్యార్థుల నృత్య ప్రదర్శన..

దమ్మపేట: మండల కేంద్రంలో ఉన్న సెయింట్ మేరీస్ ప్రైవేట్ పాఠశాల వార్షిక వేడుకలను కరస్పాండెంట్ సెబాస్టియన్ సాజు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలతో అంగరంగ వైభవంగా అలంకరించగా.. ఆ కాంతులతో పాఠశాల ప్రకాశించింది. వేడుకలకు పెద్ద మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు, పెద్దలు తదితరులు హాజరయ్యారు. వార్షికోత్సవ వేడుకలకు హాజరైన స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాలలో వేదికపై విద్యార్థులతో పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రేక్షకులను అలరించేలా విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శన చేశారు.

మున్సిపాలిటీ నమూనా మ్యాప్ పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సుజాత

అశ్వారావుపేటరూరల్: కొత్తగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీ నమూనా మ్యాప్ సిద్ధం కాగా, ఈ మ్యాప్‌ను కమిషనర్ సుజాత పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. మంగళవారం ఆమె స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఇతర సిబ్బందితో సమావేశం అయ్యారు. దీంట్లో భాగంగా టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిద్ధం చేసిన నమూనా మ్యాప్‌ను ప్రదర్శించడంతో ఆమె పలు మార్పులు, చేర్పులతో మరో నమూనాను సిద్ధం చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ మ్యాప్‌లో 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకోగా, 2025 జనవరి 1 తుది ఓటర్ల జాబితా ప్రకారం 22 వార్డులు, 16 పోలింగ్ స్టేషన్లు, ప్రతిపాదిత 22 వార్డులతో మున్సిపాలిటీ పూర్తి స్థాయి మ్యాప్‌ను సిద్ధం చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, సందీప్, స్వరూప పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం



ఆటో డ్రైవర్‌కు స్టిక్కర్ అందజేస్తున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరురూరల్: ఆటో ప్రయాణికుల భద్రత, వారి ఆస్తుల రక్షణే లక్ష్యంగా ఆటోలకు స్టిక్కరింగ్ విధానానికి శ్రీకారం చుట్టినట్లు మణుగూరు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మణుగూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటోలకు స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో తిరిగే ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా తమ తమ ఆటోలకు పోలీసుల ద్వారా స్టిక్కర్లు అంటించుకోవాలన్నారు. నేరాలను అరికట్టేందుకు, ఆటోలపై పూర్తి నిఘా ఉంచేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. స్టిక్కర్లలో ఆటో యజమాని, డ్రైవర్ల పేర్లు, ఫోన్ నెంబర్, ఆటో నెంబర్లతో పాటు పోలీసుల నంబర్లు కూడా ఉంటాయన్నారు. ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా వాహనాలను నడపాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, యూనిఫామ్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీతకు 'బాలమేళా'



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

బూర్గంపాడు: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలమేళా కార్యక్రమాలు దోహదం చేస్తాయని బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, కాంప్లెక్స్ హెచ్‌ఎం రవిలా దేవి అన్నారు. బూర్గంపాడు జీహెచ్‌ఎస్ పరిధిలోని బూర్గంపాడు-1, బూర్గంపాడు-2, గౌతమిపురం, నాగినేనిప్రోలు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతో మంగళవారం కాంప్లెక్స్ స్థాయి బాలామేళా నిర్వహించారు. ఇందులో విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కొన్ని ప్రయోగాలు ఆలోచింపజేశాయి. ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులు నగదు బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో కాంప్లెక్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాజీ సేన బైక్ ర్యాలీ



అశ్వారావుపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న శివాజీ సేన, హిందూ సంఘాల నాయకులు

అశ్వారావుపేటరూరల్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా మహారాష్ట్ర నుంచి విశాఖపట్నం వరకు ఛత్రపతి శివాజీ వారసులు, శివాజీ సేన చేపట్టిన బైక్ యాత్ర అశ్వారావుపేటకు చేరుకుంది. ఈ యాత్ర చేపట్టిన వారికి అశ్వారావుపేట హిందూ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఛత్రపతి శివాజీ చిత్రపటంతో సుమారు వంద బైకులతో రింగ్ రోడ్ సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా జంగారెడ్డిగూడెం మార్గంలో శోభయాత్ర నిర్వహించి, నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు బండారు చంద్రశేఖర్, ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు చావ్వా రమేష్, గొట్టాపు అప్పారావు, జల్లిపల్లి అరవింద్, యశోధ కల్యాణ్, శ్రావణ్, కాకి రాము, తాళం మనికంత, చైతన్య, అక్షయ్, నరేష్ పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న ఎమ్మెల్యే



తేగడలోని ఆలయంలో ఎమ్మెల్యే తెల్లం, కుటుంబ సభ్యులు

చర్ల: మండలంలోని గొమ్ముగూడెం, తేగడ గ్రామాల్లోని ఆలయాలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గొమ్ముగూడెంలోని రామాలయం, తేగడలోని భద్రకాళీ సమేత వీర భద్రస్వామి వారి ఆలయాలను దర్శించుకున్న ఆయన.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట ఆయా ఆలయ కమిటీ సభ్యులతో పాటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు ఉన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేస్తున్న మట్టా శివాజీ

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు కాంట్రాక్టర్ ఎండీ.అలీంఖాన్ ఆర్థికసాయంతో మాజీ సర్పంచ్ మట్టా శివాజీ చేతుల మీదుగా నిత్యావసరాలను మంగళవారం అందజేశారు.

విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై నిరాశ్రయులైయిన కణితి నాగమణి, భూక్యా లక్ష్మయ్య, అనిరెడ్డి వెంకన్న కుటుంబాలకు నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మట్టా శేఖర్ బాబు, పుట్ట శ్రీరామ్మూర్తి, నరేంద్ర, రాజేష్, తెల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చర్ల: చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సీఐ, ఎస్సైలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన పేద విద్యార్థిని గుండిపూడి చార్మిల చదువుకు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. భద్రాచల పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న చార్మిల ఆర్థిక పరిస్థితులు బాగలేక చదువు కష్టంగా మారింది. గత కొంతకాలంగా తల్లిదండ్రుల అనారోగ్యం పాలవ్వడంతో ఇంటి వద్దే ఉంటోంది. విద్యార్థి పరిస్థితి తెలుసుకున్న మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు, శ్రీ సురక్ష హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ అక్కినేని లోకేష్ చేతుల మీదుగా రూ.23 వేలు అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులను అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి, బాలరాజు, సాయికుమార్, కోమటిరెడ్డి చైతన్య, నాగరాజు, బూరం నవీన్, ఎడ్విన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుల చేయూత..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన లింగాల శివ గుండె సమస్యతో అనారోగ్యంతో బాధపడుతూ.. వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. తనతో పాటు చదువుకున్న మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006 పదోతరగతి పూర్వ విద్యార్థులు తమ మిత్రుడుకి మేమున్నాం అంటూ మంగళవారం రూ.22వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల సహకారం..

చర్ల: మండలంలోని లింగాపురానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి సికెల్ సెల్ ఎనీమియా వ్యాధిలో బాధపడుతుండగా వైద్యానికి చర్ల పోలీసులు ఆర్థిక సాయం అందజేశారు. లింగాపురానికి చెందిన బిల్లా ఆదిత్య–సంధ్యల ఎనిమిదేళ్ల కుమార్తె నివేదిక సికెల్ సెల్ ఎనీమియాతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న సీఐ రాజువర్మ ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రూ.10 వేలను ఆ కుటుంబానికి అందజేశారు. పోలీసులు చూపిన ఔదార్యాన్ని పలువురు అభినందిస్తున్నారు.